

మహబూబ్‌నగర్‌లో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, నాయకులు

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు జాతీయ జెండాను ఆవిష్కరించి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలోనూ తెలంగాణ అవతరణ దినోత్సవం నిర్వహించారు. పార్టీ కార్యాలయాల వద్ద జాతీయ జెండా, బీఆర్‌ఎస్ జెండాలను ఎగురవేసి తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలు వేసి అమరులకు నివాళులర్పించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ 14 ఏండ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. పోరాడి సాధించిన తెలంగాణను కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపినట్లు వారు వివరించారు.

— నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 2



నారాయణపేటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

# అవతరణ.. సంబురం

- అమరులకు నివాళులర్పించిన నాయకులు, అధికారులు
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలు

## ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం



నాగర్‌కర్నూల్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి



అలంపూర్‌లో జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే విజయుడు



భూత్పూర్‌లో జెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



మక్తల్‌లో జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

### జాతీయ జెండాకు అవమానం



దేవరకద్ర, జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దేవరకద్రలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను తల కిందులుగా ఆవిష్కరించారు. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద జాతీయ జెండాను పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫారుఖ్ అలీ జెండాను తలకిందులుగా ఎగురవేయడంతో గమనించిన నాయకులు వెంటనే సరిచేసి తిరిగి ఆవిష్కరించారు. జాతీయ జెండాను తల కిందులుగా ఎగురవేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కంచె చేను మేసినట్టుంది..

- క్రమశిక్షణ తప్పిన ఎంపీపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాం
- ప్రతిపక్ష ఎమ్మెల్యేను వెంట బెట్టుకుని సొంత పార్టీ నేతలను పట్టించుకోరా..?
- ఎంపీ మల్లు రవిపై నడిగడ్డ కాంగ్రెస్ నాయకుల ఫైర్

గద్వాల ,జూన్ 2 : నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి తీరు కంచె చేను మేసిన వైనంలా ఉందని నడిగడ్డ కాంగ్రెస్ నాయకులు ఫైర్ అయ్యారు. గద్వాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. అనంతరం ఎంపీ మల్లు రవి అలంపూర్ ఎమ్మెల్యే విజయుడును వెంట బెట్టుకొని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరితా తిరుపతయ్య ఆహ్వానం మేరకు తేనీటి విందుకు వెళ్లారని, కాంగ్రెస్ పార్టీ నాయకులను విస్మరించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేను కారులో ఎక్కించుకొని కాంగ్రెస్ నాయకులను పట్టించుకోకుండా వారి మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించారని మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ కమిటీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంపీ ఆయనే క్రమశిక్షణ తప్పడం ఏంటని ప్రశ్నించారు. ఎంపీ జిల్లాలో బీఆర్‌ఎస్ నాయకులను ప్రోత్సహిస్తున్నారని, కొంత మంది కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను పదిశాతం కమీషన్ తీసుకుని మంజూరు చేయిస్తున్నారని అందుకు సంబంధించిన ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని ఆరోపించారు. పార్టీలో క్రమశిక్షణ తప్పిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన వ్యక్తే క్రమశిక్షణ తప్పడంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే ఎంపీ అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయ దర్శనం కోసం వెళ్లినా ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఎవరూ ఉండకపోవడం విశేషం.



మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత నివాసంలో ఎమ్మెల్యే విజయుడుతో ఎంపీ మల్లురవి

- జడ్చర్లలో జాతీయ రహదారి విస్తరణ పనుల డిజైన్ మారిందనేది కేవలం అపోహ మాత్రమే
- భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండదు
- ప్రజల బాగు కోసం పనిచేయాలి.. అన్నిట్లోనూ రాజకీయాలు చేయటం సరికాదు
- మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

# యథావిధిగా పాతబజార్‌కు రహదారి



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి

జడ్చర్లటౌన్, జూన్ 2 : 167వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా డిజైన్ మారడంతో అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బజార్‌కు వెళ్లే రహదారి మూత పడుతుందన్నది కేవలం అపోహ మాత్రమే అని జడ్చర్ల మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం జడ్చర్లలోని గౌడ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోదాడ నుంచి జడ్చర్ల మీదుగా చేపడుతున్న 167వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మొదటగా జడ్చర్లలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం మంజూరయ్యిందన్నారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో పాత బజార్, నేతాజీ చౌరస్తా ప్రాంతాల ప్రజల రవాణాకు ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశంతో అప్పట్లో జాతీయ రహదారుల సంస్థ అధికారులతో మాట్లాడి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిలుపుదల చేశామన్నారు. ఆ తర్వాత పట్టణ ప్రజల రవాణా సదుపాయం దృష్ట్యా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం లేకుండా రహదారి విస్తరణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నామన్నారు. రహదారి విస్తరణ పనుల నిమిత్తం అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న విగ్రహాల తరలింపు విషయంలో ఇటీవల జరిగిన సమావేశంలో జాతీయ రహదారి పనుల డిజైన్ మారిందని, ఇక పాత బజార్‌కు వెళ్లే రహదారి మూత పడనుందని, తద్వారా భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోతాయని కన్‌ఫ్యూజన్ ఏర్పడిందన్నారు. ఈ విషయం తన దృష్టికి రాగానే జాతీయ రహదారుల సంస్థ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి వివరాలను తెలుసుకోవటం జరిగిందన్నారు. జాతీయ రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో యథావిధిగా అంబేద్కర్ చౌరస్తా వద్ద సర్కిల్ ఉంటుందని, అక్కడి నుంచి పాత బజార్‌కు వెళ్లేందుకు రహదారి సదుపాయం ఉందని అధికారులు తెలియజేసినట్లు చెప్పారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి భారీ వాహనాలు పాతబజార్ ప్రాంతానికి వెళ్లేలా రహదారి ఉంటుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడినప్పుడు ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్లేందుకు గానూ అంబేద్కర్ చౌరస్తా వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన విషయాన్ని వివరించారు. అంబేద్కర్ విగ్రహం నుంచే పాతబజార్‌కు వాహనాలు రాకపోకలు కొనసాగించేలా రహదారి ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. అదేవిధంగా జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా కేవలం జడ్చర్లలో ఇండ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం అందలేదని చేస్తున్న ఆరోపణలు సరికావన్నారు. జాతీయ రహదారుల సంస్థ నిబంధనల ప్రకారం 50 ఫీట్ల తర్వాత ఇండ్లు కోల్పోయిన వారికి మాత్రమే పరిహారం వస్తోందని, ఇందుకుగానూ కోదాడ నుంచి జడ్చర్ల వరకు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా దాదాపు 10 పట్టణాల్లో ఇండ్లు కోల్పోయిన బాధితులెవరికి పరిహారం అందలేదన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

ఇండ్లు కోల్పోయిన బాధితులకు పరిహారం ఇప్పిస్తానని ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చెప్పటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బాధితులకు పరిహారం అందించే విషయంలో తన సహకారం ఉంటుందని చెప్పారు. ప్రజల బాగు కోసం పనిచేయాలి తప్పా అన్నిట్లోనూ రాజకీయాలు చేయటం సరికాదని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, కౌన్సిలర్లు ఉమా శంకర్ గౌడ్, నందికిశోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, మహేశ్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పిట్టల మురళి, నాయకులు, పాతబజార్ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్ చౌరస్తా, జూన్ 2 : వానకాలం సీజన్ మొదలవుతుంది.. రైతులందరూ నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి వ్యాపారుల నుంచి విధిగా రశీదులను స్వీకరించాలని ఎమ్మెల్యే విజయుడు సూచించారు. సోమవారం ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉండవెల్లి, అలంపూర్ మండలాలకు చెందిన రైతులకు 10 కేజీల వరి విత్తనాలను ఎమ్మెల్యే విజయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం లాభసాటి వ్యవసాయానికి సోపానం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. పంటలు సాగు చేసే రైతు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి అధిక దిగుబడి సాధించాలన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వరి విత్తనాలు ఆర్‌ఎన్‌ఆర్ 15048 రకం అధిక దిగుబడి కోసం అభివృద్ధి చేశారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శంకర్‌తో పాటు మండల వ్యవసాయాధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## బాహుబొచ్చ

పెంట్లవెల్లి, జూన్ 2 : జూరాల నుంచి నీటి విడుదలతో కృష్ణానది తీర ప్రాంతంలో మత్స్యకారులకు భారీ చేపలు లభ్యమవుతున్నాయి. సోమవారం మండలంలోని మంచాలకట్టకు చెందిన మత్స్యకారుడు నాగార్జున చేపల వేటకు వెళ్లగా, 22కిలోల భారీ బొచ్చ రకం చేప వలకు చిక్కింది.



- నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

# కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 2 : బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మంతటి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఆదివారం సాయంత్రం మంతటి చౌరస్తాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి సోమవారం నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లి కార్యకర్త మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.



బాధిత కుటుంబంతో మాట్లాడుతున్న మర్రి జనార్దన్‌రెడ్డి

## జూరాల, తుంగభద్రకు వరద

అయిజ, జూన్ 2 : కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, తుంగభద్ర నదులకు వరద కొనసాగుతున్నది. సోమవారం జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 26వేల క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 29,338 క్యూసెక్కులుగా నమోదైంది. పవర్‌హౌస్‌కు 28,521 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గరిష్ఠ నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 8.690 టీఎంసీలు నిల్వ ఉన్నది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 13,300 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 236 క్యూసెక్కులు ఉన్నది. 105.788 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 18.863 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు అవుట్ ఫ్లో 2,100 క్యూసెక్కులు దిగువన ఉన్న సుంకేసుల బరాజ్‌కు చేరుతోంది. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

# ధాన్యం తరలించాలని రైతు నిరసన

- లారీ కింద పడుకొని వేడుకోలు

అయిజ, జూన్ 2 : తూకం వేసి నిల్వ చేసిన వరి ధాన్యం తరలించాలని మండలంలోని పులికల్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతు జమ్మన్న డీసీఎం కింద పడుకొని నిరసన తెలిపారు. సోమవారం ఒకటి, రెండు లారీలు రాగా, రైతులు తమ ధాన్యం ఎత్తాలని, లేదు తమ ధాన్యం తరలించాలని లారీల డ్రైవర్లు, ఐకేపీ నిర్వాహకులను రైతులు డిమాండ్ చేశారు. దీంతో చేసేదిలేక డ్రైవర్లు లారీలను నిలిపివేశారు. గత వారం రోజుల కిందటే ధాన్యం తూకం వేసినా లారీలు రాకపోవడంతో ధాన్యం తరలింపులో జాప్యం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వస్తుండడంతో ఎక్కడ ధాన్యం తడుస్తుందోనని ఆందోళన చెందుతున్నామని, ధాన్యం తడిస్తే మిల్లర్లు ధాన్యం తిరస్కరిస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల కిందటే ధాన్యం తూకం చేసి 70 బస్తాలను నిల్వ చేశామని, అయినా లారీలు సమయానికి రాకపోవడంతో రేయింబవళ్లు కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాస్తున్నామని రైతు సమ్మన్న తెలిపారు. ధాన్యం తరలింపునకు వాహనాలు అధికంగా కేటాయించాలని రైతులు కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలను కోరినా పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొన్నారు. పులికల్ ఐకేపీ నిర్వాహకుల నిర్లక్ష్యంతో వాహనాలు సకాలంలో రాక పోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ఉన్నతాధికారులకు ఎన్ని సార్లు వినతి పత్రాలు ఇచ్చినా కొనుగోళ్ల కేంద్రాలపై దృష్టి సారించడంలేదని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆరోపించారు. కలెక్టర్ వెంటనే పులికల్ ఐకేపీ కేంద్రం నుంచి తక్షణమే ధాన్యం తరలించాలని ఆయన డిమాండ్ చేశారు.



పులికల్ ఐకేపీ కేంద్రం వద్ద లారీ కింద పడుకుని నిరసన తెలుపుతున్న రైతు జమ్మన్న